ప్రాసెసింగ్ ప్లాంట్ సందర్శన



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో ప్రాసెసింగ్ ప్లాంట్‌లోని తడి చెత్త, పొడి చెత్త ప్రాసెస్‌ను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. బుధవారం పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వరరావు వారికి కంపోస్టింగ్ ద్వారా ఎరువు తయారు చేసే విధానం, బయోగ్యాస్ ఉత్పత్తి గురించి వివరించారు. పొడి చెత్తలో ప్లాస్టిక్ కాగితం, గాజు, లోహాలు వంటి పునర్వినియోగం చేయగలిగే పదార్థాల రీ సైక్లింగ్ గురించి వివరించారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట

అల్వాల్: దేశ ప్రజలకు జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట కలిగిందని, బీజేపీ నేతలు అన్నారు. బుధవారం ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ.. బీజేపీ నేతలు అల్వాల్ మీ–సేవ నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు పాదయాత్ర చేశారు. నాయకులు మల్లికార్జున్‌గౌడ్, లక్ష్మణ్‌ముదిరాజ్, అజయ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాధవ్, అనిల్‌యాదవ్, ఉదయ్, సుజాత, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

అండర్ -14 క్రికెట్ టోర్నమెంట్



బోడుప్పల్: ఎస్‌కెఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో స్టంప్స్ క్రికెట్ టోర్నమెంట్ అండర్– 14, సీజన్ క్రికెట్ పోటీలు జరిగాయి. బుధవారం మొత్తం ఆరు జట్లు పాల్గొనగా.. ఫైనల్ మ్యాచ్‌లో ఎస్‌కేఎస్ టీమ్ 104 పరుగులు చేసింది. ఆర్‌సీఎటీమ్ 45 పరుగులు సాధించింది. రన్నర్ కప్, విన్నర్ కప్‌ను విజేతలకు మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు సాయిబాబా, పరుశురాం, నేతలు గజ్జల సత్యరాజ్‌గౌడ్, రంగు మల్లిఖార్జున్‌గౌడ్, రాసాల కుమార్‌యాదవ్, జైదేవ్‌గౌడ్, రాంగోపాల్ పాల్గొన్నారు.

రూ.2.76 కోట్లతో యూజీడీ నిర్మాణ పనులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.2.76 కోట్ల నిధులు మంజూరైనట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్‌లో సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక తరచుగా ముంపు సమస్యను హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ దృష్టికి తీసుకెళ్లి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎండీ రూ.2.76 కోట్లు మంజూరు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని, చాలా ఏళ్లుగా ముంపునకు గురౌతున్న కాలనీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు.

'బీహెచ్‌ఈఎల్' ఆర్టిజన్ అభ్యర్థుల నిరసన

మల్కాజిగిరి: మౌలాలిలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం బీహెచ్‌ఈఎల్ ఆర్టిజన్ ఉద్యోగానికి మధ్యాహ్నం పరీక్ష నిర్వహించారు. పరీక్ష సమయం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు జరిగింది. తర్వాత అభ్యర్థులందరికి సరిచూసుకోవడానికి 15 నిమిషాలు సమయం ఇచ్చారని, తర్వాత బయటకువచ్చామని అభ్యర్థులు తెలిపారు. బయటికొచ్చిన తర్వాత మరికొంత మందికి మరో 15 నిమిషాలు అదనంగా ఇచ్చారని తెలిసిందని దీనివల్ల నష్టపోయామని అభ్యర్థి నవీన్‌తో పాటు పలువురు తెలిపారు. పరీక్ష నిర్వాహకులను విచారిస్తే అలాంటి అవకాశం లేదని, కేవలం దివ్యాంగ అభ్యర్థులకు నిబంధన మేరకు అదనపు సమయం ఉంటుందని వివరణ ఇచ్చారు. 1.30 తర్వాత ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను నిబంధనల మేరకు అనుమతించలేదని స్పష్టం చేశారు.

సీజేఐపై దాడికి నిరసన

మల్కాజిగిరి: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడిని నిరసిస్తూ మల్కాజిగిరి చౌరస్తాలో సీపీఎం మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. లక్ష్మణ్, సీనియర్ నాయకుడు కృపాసాగర్‌లు మాట్లాడుతూ.. అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిపై దాడి జరగడం సిగ్గుచేటన్నారు. నిందితుడి వయస్సు, హోదాను చూడకుండా శిక్షించినప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. విజయ్‌కుమార్, శ్రీనివాస్, మంగ, సూర్యకుమార్, ప్రదీప్‌దాస్, గుప్తా, మురళీమోహన్ పాల్గొన్నారు.

తిప్పలు తప్పేదెలా ?



నాగారం-కుషాయిగూడ ప్రధాన రహదారిపై వరద ఉధృతి (ఫైల్)

వర్షం పడితే జలదిగ్బంధంలో కాలనీలు

- తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి

కీసర: వర్షం కురిసిందంటే చాలు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో పలు కాలనీలు నీట మునిగాల్సిందే. కాలనీల్లో ఇళ్ల మధ్య నుంచి పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహిస్తుండటంతో ఆ కాలనీల్లో నివసించే ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఒక్కసారి భారీవర్షం పడిదంటే చాలు కాలనీల్లో వరద నీరు రోజుల తరబడి ప్రవహిస్తుండటంతో ఒక్కోసారి ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది.

జలమయమైన లోతట్టు ప్రాంతాలు..

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నాగారం, దమ్మాయిగూడలోని చెరువులు, కుంటలు పొంగి పొర్లిపోయి లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. వర్షాలు కురిసిన సమయంలో ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి చౌరస్తా వద్ద వరద పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతోంది.



జలదిగ్బంధంలో కాలనీ (ఫైల్)

నరకం చూస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు..

ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ విద్యార్థులు, ఉద్యోగస్తులు నరకం అనుభవిస్తున్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడం వల్ల ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

☛ రాంపల్లి చౌరస్తా దిగువ ప్రాంతాలైన దాయర కుంట సమీపంలోని బీఎంఆర్‌కాలనీ, అరవింద్‌నగర్, సాయిసంజీవ, ఎస్సీ బీసీసీకాలనీ, శ్రీరత్నకాలనీ, కాలనీల రహదారులు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో ఆయా కాలనీల్లో నివసిస్తున్న ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు..

వరదనీరు సాఫీగా దిగువ ప్రాంతంలో చర్లపల్లి చెరువులోకి వెళ్లేలా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. రాంపల్లి చౌరస్తా నుంచి ప్రధాన రహదారి వెంబడి నాగారం పెద్ద కప్పు వద్ద గల అన్నరాయిని చెరువు నీరు వెళ్లే నాలాలో ఈ నీటిని కలిపే విధంగా పైపులైన్ పనులు చేపట్టాలని లోతట్టు కాలనీవాసులు, వరదముంపు కాలనీల జేఏసీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

☛ గత ప్రభుత్వ హయాంలో వరద నీటి కష్టాలు తీర్చేందుకు దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో అప్పటి మంత్రి మల్లారెడ్డి చేపట్టిన స్ట్రీమ్ వాటర్ పైపులైన్ పనుల వల్ల దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు కాలనీలో వరదనీటి కష్టాలు 80 శాతం మేర పరిష్కారం లభించింది.

☛ నాగారం మున్సిపల్ పరిధిలో స్ట్రీమ్ వాటర్ పైపులైన్ పనులు పూర్తికాకపోవడంతో వరదనీటి కష్టాలు తప్పడం లేదు. వర్షాలు కురిసిన సమయంలో అధికారులు, పాలకులు తాత్కాలికంగా చర్యలు చేపట్టడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

☛ రాంపల్లి చౌరస్తాలో ప్రధాన రహదారిలో వరద నీరు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నాగారం, దమ్మాయిగూడ రెండు మున్సిపాలిటీల పరిధిలో వరదనీటి కష్టాలను తొలగించేందుకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాగారం - కుషాయిగూడ రహదారిపై ట్రా'ఫికర్'..

వరద ప్రవాహం ఉన్న సమయంలో నాగారం - కుషాయిగూడ ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వరదనీటి కారణంగా ఇటు ఐకాం, అటు చక్రపురం వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



రాంపల్లి చౌరస్తాలో ట్రా'ఫికర్' (ఫైల్)

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మల్లాపూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్: వీఎస్ఆర్ గార్డెన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఉప్పల్ మండలానికి చెందిన 224 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. తహసీల్దార్ వాణిరెడ్డి, కార్పొరేటర్లు బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, శాంతిసాయిజెన్‌శేఖర్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

రామంతాపూర్: డివిజన్ పరిధిలో 61 మంది లబ్ధిదారులకు బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి కల్యాలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం



బోడుప్పల్: 3వ డివిజన్ పరిధిలోని శివశక్తి నగర్ ఫేస్– 1లో నూతనంగా ఏర్పాటు చేసిన కమాన్‌ను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులంతా ఐక్యంగా ఉండి కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు వివరించారు. మాజీ కార్పొరేటర్ కొత్తచందర్‌గౌడ్, బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, నేతలు రంగ బ్రహ్మన్నగౌడ్, కుర్రి శివశంకర్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: డివిజన్ పరిధిలోని కిషన్‌ప్రసాద్ కాలనీలో కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. బుధవారం కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు, విద్యుత్ దీపాలు వెలగడం లేదని కాలనీవాసులు వారికి తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏఈ ప్రశాంతి, శేఖర్, ఇమ్రాన్, కాలనీవాసులు బాలరాజు, లోకేష్, సునీల్, అశోక్, మల్లిఖార్జున్, రాంచందర్, రాజేందర్, రాజ్‌కుమార్, రాములమ్మ, నాయకులు యాదగిరిగౌడ్, ప్రేమ్‌కుమార్, సాజిద్ పాల్గొన్నారు.



కిషన్‌ప్రసాద్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి

ఆహారంలో గుండు సూది !



మల్లాపూర్: నాచారంలోని ఓ ఫ్యామిలీ దాబా హోటల్‌లో నాచారంకు చెందిన సంతోష్‌కుమార్ మధ్యాహ్నం వెజ్ బిర్యానీ ఆర్డర్ చేశాడు. తినే క్రమంలో కర్రీలో గుండు సూది దర్శనమిచ్చింది. వేయిటర్, కౌంటర్ బాయ్‌కి గుండు సూది చూపించడంతో వారు తప్పును అంగీకరించారన్నారు. అనంతరం హోటల్ యజమాని రావడంతో కస్టమర్‌తో గుండు సూదిని మీరు మింగలేదు కాదా.. అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం. 'మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడని, బాధితుడు హోటల్‌పై ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, డిప్యూటీ మేయర్‌కు ఫిర్యాదు చేశాడు.

యాదవ సంఘానికి స్థలం కేటాయించాలి



మౌలాలి: నేరేడ్‌మెట్ పరిధిలో యాదవుల పశువులు కట్టేసుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాముయాదవ్‌కు స్థానిక యాదవసంఘం సభ్యులు కోరారు. బుధవారం ఆయనకు వినతిపత్రలం అందజేశారు. నేరేడ్‌మెట్ సంఘం నాయకులు పూలపల్లి సుందర్‌యాదవ్, యాతం మంజుల, పొన్నగంటి హరికష్ణ, పులిగిల్ల నర్సింగ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'బాకీ కార్డులు' పంపిణీ



బాకీకార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతోనే అధికారంలోకి వచ్చిందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసినందుకు కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ 'బాకీ కార్డ్' ఉద్యమం చేపట్టిందన్నారు. బుధవారం మల్లాపూర్‌లో ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి బాకీకార్డును పంపిణీ చేశారు. రైతుబంధు, మహిళలకు, యువతులకు, వృద్ధులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం విఫలమయ్యారని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు తులం బంగారం ఎప్పుడిస్తారని..? ప్రశ్నించారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన

బోడుప్పల్: చెంగిచర్లలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన, మహిళలపై నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి మేడిపల్లి ఎస్సై ఉదయ్‌భాస్కర్ హాజరై డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ యువత భవిష్యత్తును దెబ్బ తీస్తుందని, ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ 'సేవ్ సొసైటీ' కోసం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: కాలనీల్లో అభివృద్ధి చేసిన పార్కులను కాపాడుకుందామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం భ్రమరాంబికానగర్‌లో రూ.8 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు ప్యాచ్‌వర్క్స్ పనులను ఆయన ప్రారంభించిన అనంతరం పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో నిధుల కొరత ఉన్నప్పటికీ పనులు మంజూరు చేయించి పూర్తి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కాలనీ ప్రజల కోసం పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొందరు ఆకతాయిలు, తాగుబోతులు అడ్డాగా మార్చుకుని పాడుచేస్తున్నారని, పోలీసుల గస్తీ పెంచాలని కోరామన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్ తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



మరకత గణపతి మూల విరాట్

అల్వాల్: ప్రపంచంలోనే అరుదైన మరకత మూలవిరాట్‌గా మలిచిన కానాజీగూడ లక్ష్మీగణపతి దేవాలయ అభివృద్ధికి తోడ్పాటును అందించి, ఆలయ అభివృద్ధి పాటుపడాలని ఆలయ వ్యవస్థాపకులు మోత్కూరు సత్యనారాయణశాస్త్రి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఆలయాన్ని భక్తుల సౌకర్యార్థం విస్తరించేందుకు అన్నప్రసాద భవనం, నిత్య కల్యాణమండపం, కోనేరు, వేదపాఠశాల, గోశాల ఏర్పాటుకు రూ.200 కోట్ల అంచనాతో స్థల సేకరణకు రూ.50 కోట్లు కేటాయించి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారన్నారు. భక్తులు భూదాన మహాయజ్ఞంలో పాల్గొని ఆలయ అభివృద్ధికి పాటుపడాలని విన్నవించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



కాప్రా: డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. బుధవారం కాప్రా డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాకేత్ శ్రీయుగ కాలనీలో రూ.50 లక్షలతో పార్క్ అభివృద్ధి, ఓయూటీ కాలనీలో రూ.95లక్షలతో థీమ్ పార్క్ అభివృద్ధి, సుందరీకరణ, సీఎస్‌నగర్–ఆర్టీసీ కాలనీ వరకు రూ.27 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నామని తెలిపారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలకృష్ణ, ఏఈ సూరజ్, స్థానిక నేతలు పవన్, శ్రీహరి, మనోజ్‌కుమార్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయితో సంచరిస్తున్న ఇద్దరి రిమాండ్

బోడుప్పల్: అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి బయటపడింది. మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి ప్రశాంత్‌నగర్ కాలనీలో బుధవారం ఉదయం మేడిపల్లి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. ఘట్‌కేసర్, గణపురం గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ అలియాస్ పెద్ద పికె (31), మేడిపల్లి క్రాంతి కాలనీకి చెందిన బక్కి నవీన్ (26)ప్రైవేట్ ఉద్యోగి. కాగా ఇద్దరు గంజాయి సేవించేందుకు తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 65 గ్రాముల గంజాయి, ఒక యాక్టివా వాహనం, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించామన్నారు.

చికెన్‌షాపు నిర్వాహకులను ఆదుకోవాలి

మల్కాజిగిరి: చికెన్ పౌల్ట్రీ యజమానులు చిన్న, చిన్న చికెన్‌షాపు నిర్వాహకులకు న్యాయం చేయాలని మల్కాజిగిరి చికెన్‌షాప్స్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డిలు విజ్ఞప్తి చేశారు. బుధవారం నేరెడ్‌మెట్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతి రోజూ పెద్దపెద్ద కంపెనీలు, పౌల్ట్రీ యజమానులు పేపర్‌లో ధరలు ఇస్తున్నారని, ఆ ధరలకు షాపుల ధరలకు తేడా ఉంటుందన్నారు. వినియోగదారులు పేపర్ ధరకే డబ్బులు చెల్లిస్తామని అంటున్నారని దానివల్ల నష్టపోతున్నామన్నారు. కంపెనీలు మార్జిన్ తగ్గించడం వలన ఇప్పటికే నష్టపోతున్నామని గతంలో ఉన్న మార్జిన్ చెల్లించాలని కోరారు. చాలామందికి జీవనోపాధి చికెన్ షాపుల వలన కలుగుతోందని యజమానులు ఆలోచించాలన్నారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాజు, ఎస్. నరేష్, కన్నా, నరేందర్ రెడ్డి, గోపాల్‌నాయక్, ఇదాయత్, ఖాసీం, రాజేష్, ఆరీఫ్, అజయ్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలేవి ?





గుర్రపుడెక్కతో నిండిన బండచెరువు

మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని మౌలాలి, వినాయకనగర్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళల్లో కంటి మీద కునుకు ఉండటం లేదని వాపోతున్నారు. ఎప్పటికప్పుడు సూచనలు చేయాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో ఫాగింగ్ సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలున్నాయి.

సమస్యాత్మక ప్రాంతాలు..

బండచెరువు, లాల్వానీనగర్, సంతోషిమానగర్ కాలనీ, ఆర్టీసీకాలనీ, సఫీనగర్, హనుమాన్‌నగర్, మౌలాలి, భరత్‌నగర్‌లలో దోమలతో ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు. చీకటి పడితే ఒక్క నిమిషం కూడా ఆరుబయట ఉండే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫాగింగ్ చేయడం మరిచారు..

కాలనీల్లో ప్రతి 15 రోజులకోసారి ఫాగింగ్ చేయాల్సిన సిబ్బంది నెల రోజులకోసారి కూడా రావడం లేదని, దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో 6 డివిజన్లు ఉంటే సుమారు 300 కాలనీలు ఉన్నాయి. సిబ్బంది 130 ఉండగా.. ఫాగింగ్ యంత్రాలు 18 ఉన్నాయి.

రాత్రుళ్లు బయటకు రాలేక పోతున్నాం



బండచెరువు పరిసరాల్లో రాత్రి 6 గంటలు దాటితే తలుపులు తీయాలంటే భయమేస్తోంది. చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలి. అధికారులు తగిన చర్యలు తీసుకుని క్రమం తప్పకుండా ఫాగింగ్ చేసేలా చూడాలి.

– ప్రసాదరావు, కాకతీయనగర్

వ్యాధుల బారిన పడుతున్నాం



దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముసలివాళ్లు, చిన్నారులు రోగాల బారిన పడుతున్నారు. దోమల మందు నాశిరకంగా ఉంటోంది. అధికారులు కాలనీల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– పుష్పావతి, శివానగర్ మౌలాలి